www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

వాణిజ్య ద్వారము
తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 సంచిక :24 22-03-2021 పుటలు : 4

**మార్చి 20**
**ప్రపంచ పిచ్చుకల దినోత్సవం**

జీవ వైవిధ్యమే పర్యావరణ రక్షణ!
వేసవి కదా... మీరున్న చోట
పక్షులకు గిన్నెతో నీళ్లు
ఏర్పాటుచేయండి.
**-నన్నయవాణి**



## ఈ-జర్నల్ ప్రారంభించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**19.03.21 (మీడియాసెల్)** ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలపై అన్ని రకాల గుర్తింపులతో యూనివర్సిటీ ఈ-జర్నల్ ను ప్రారంభించాలని, దానికి అవసరమైన కార్యచరణను రూపొందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్లుతో సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కి సంబంధించిన అంశాలతో యూనివర్సిటీ ఈ-జర్నల్ ను ప్రారంభించాలని అన్నారు. ఏడాదికి రెండు సంచికలతో అర్ధవార్షిక జర్నల్ గా దీనిని రూపొందించాలని చెప్పారు. ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలోని విద్య, విజ్ఞాన, పరిశోధన, రివ్యూ అర్టికల్స్ వంటి కీలక అంశాలు దీనిలో ఉంటాయన్నారు. ఐ.ఎస్.ఎస్.ఎన్ గుర్తింపు, డిజిటల్ అబ్జెక్టివ్ ఐడెంటిఫికేషన్ మరియు యూజీసీ గుర్తింపులతో ప్రతిష్టాత్మకంగా దీనిని ప్రారంభించాలని తెలియజేసారు. విశ్వవిద్యాలయంలోని ఆచార్యులతో పాటు బయట నుండి నిపుణులు, మేధావులు ఈ-జర్నల్ బోర్డులో సభ్యులుగా ఉంటారని చెప్పారు. దీనికి సంబంధించి విశ్వవిద్యాలయ అధికారులంతా ప్రణాళికలు సిద్ధం చేయాలని విశ్వవిద్యాలయ స్థాయిలో అన్ని గుర్తింపులతో ఈ-జర్నల్ ను త్వరలో ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్లు, ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కరగనిదే కొవ్వొత్తికి
కాంతి ఎలా
పుడుతుంది?!

మరగనిదే నీరు ఎలా
మబ్బు రూపు
కడుతుంది?!

ఫలితం అందేది
తీవ్ర పరిణామంలోనే
సుమా!!
– ఆచార్య
సి.నారాయణరెడ్డి.

# ఎన్ఎస్ఎస్ సేవలకు ప్రత్యేక గుర్తింపు

## స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.కె.రమేష్ రెడ్డితో ఇంటర్వ్యూ



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ గా డా.కె.రమేష్ రెడ్డి కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. (వారితో ఎడిటర్ ముఖాముఖి)**

**సర్. నమస్సులు ! తమ విద్యాభ్యాస విషయాలు తెలియజేయండి.**

నేను ఎం.ఎస్సీ స్టెటస్టిక్స్ 1996-98, పీజీ డిప్లామా కంప్యూటర్ అప్లికేషన్స్ ఎస్.వి.యూనివర్సిటీ, 1998-99, ఎంసిఎ 2000-2002, "సొంత మరియు క్రాస్ ఉత్పాదక సామర్థ్యాలను అంచనా వేయడం" అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసాను.

**ఉద్యోగ, పరిశోన విషయాలు తెలియజేయండి.**

15 సంవత్సరాలు టీచింగ్ అనుభవాన్ని సంపాధించుకున్నాను. అంతర్జాతీయ ప్రచురణలు 33, జాతీయ ప్రచురణలు 3 చేసాను. జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ఉత్తమ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అవార్డు (రాస్ట్రాపతి అవార్డు) 2017-18, ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు 2016-17 లబించింది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అవార్డు 2015-16, ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డులు 2014-15 లబించాయి. 3 అంతర్జాతీయ సభ్యత్వాలలో, 2 ఎడిటోరియల్ బోర్డుకు సభ్యునిగా ఉన్నాను. ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫిసర్ గా ప్రారంభమై రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా, ఉన్నత విద్య విభాగం, ఎ.పి. సెక్రటేరియట్, వెలగపుడిలో 03-09-2019 తేదీ నుండి విధులు నిర్వహిస్తున్నాను.

**కోవిడ్ లో ఎన్.ఎస్.ఎస్ సేవలు గురించి తెలియజేయండి.**

కోవిడ్ సమయంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటరీలు విశేషమైన సేవలను అందించి సేవకు ప్రతిరూపాలుగా నిలిచారు. పేదలకు, వలసకూలీలకు భోజనాలను పంపిణీ చేయడం, కంట్రోల్ రూమ్స్ నిర్వహణ, క్వారంటైన్ సేవలు, వైద్య రక్షణ శాఖలకు సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలతో కోవిడ్ వారియర్స్ లాగా నిలిచారు.

**ఎన్.ఎస్.ఎస్‌లో సాధించే అంశాలు.**

యువతలో సేవా ధృక్పదం అలవాటు అవుతుంది. సమాజహితం కోసం పని చేయాలనే భావణ, తగ్గింపు జీవితం, సమాజ పరిస్థితులపై అవగాహణ కలుగుతాయి. ఎన్.ఎస్.ఎస్ సేవలు మాత్రమే కాకుండా విద్య, ఉద్యోగ మరియు ఉన్నత అర్హతలకు మార్గాలుగా ఉంటాయి. దేశం గర్వించదగిన రిపబ్లిక్ డే పెరెడ్ లో పాల్గొనే అవకాశం ఎన్.ఎస్.ఎస్ ద్వారా దక్కుతుంది. గల్లీలో ముసలి అవ్వకు సహాయం చేయవచ్చు ఢిల్లీలో జాతీయ నాయకులను కలుసుకోవచ్చు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎన్.ఎస్.ఎస్ పని చేస్తున్న వారికి స్పెషల్ బెన్ఫిట్ ను ఇచ్చే ఆలోచనలో ఉంది.

**నన్నయ వర్సిటీ ఎన్.ఎస్.ఎస్ విభాగ విశేషాలు.**

రాష్ట్రంలోనే 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అతిపెద్ద ఎన్.ఎస్.ఎస్ విభాగంగా గుర్తింపు పొందింది. దీనిని 310 యూనిట్లుగా పెంచే అవకాశం కూడా ఉంది. శక్తి సామర్థ్యాలు, సేవ దృక్పథంతో ముందుకు వచ్చే యువత, కోవిడ్ కాలంలో చేసిన సేవా, విద్య, విజ్ఞాన కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

**జాతీయ స్థాయిలో నన్నయ పాత్ర.**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. రెండు పర్యాయాలు రాష్ట్రపతి అవార్డులను అందుకున్న విశ్వవిద్యాలయం ఇది. ప్రీ రిపబ్లిక్ డే జోన్ సెలక్షన్స్ విశ్వవిద్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో యూత్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలను నన్నయ విశ్వవిద్యాలయానికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

మంచిదండి. ఆంధ్రప్రదేశ్ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్‌గా మీరు అందిస్తున్న సేవలు మరిన్ని ఫలితాలను ఇవ్వాలని, యువత సేవ, విద్య, ఉద్యోగ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం. ఎన్ఎస్ఎస్ సేవలకు నన్నయవాణి తరుపున కృతజ్ఞతల్ని తెలియజేస్తున్నాం.

**నమస్కారం సర్.**
**థాంక్స్, మళ్ళీకలుద్దాం.**

## సంపాదకీయం



# జాతి రత్నాలు

ఇది సినిమా కాదు.

నవరత్నాలు అని ఉన్నాయి. జాతి(జన్మ)నక్షత్రాన్ని బట్టి ధరించే రత్నాలు. వజ్రం, వైడూర్యం, గోమేధికం, పుష్యరాగం, మరకతం, మాణిక్యం, నీలం, పగడం, ముత్యం... వీటిని నవరత్నాలంటారు. ఇందులో స్వచ్ఛమైన వాటిని జాతిరత్నాలంటారు.

మరొకటి-నవరత్నాలు అని సంస్కృత కవులు తొమ్మండుగురు విక్రమార్కుని ఆస్థానంలో ఉండేవారట. కాళిదాసు, ధన్వంతరి, క్షపనకుడు, అమరసింహుడు, శంకుడు, భేతాళభట్టు, ఘటకర్పరుడు, వరాహమిహిరుడు, వరరుచి... ప్రసిద్ధమైన రచనలతో, అపారమైన పాండిత్యంతో వీరు జాతిరత్నాలయ్యారు.

భరతముని తన నాట్యశాస్త్రంలో నవరసాల్ని చర్చించాడు. శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత, శాంత రసాలు. ఈ నవరసాలు ఉంటేనే కావ్యమైనా,నాటకమైనా పాఠకుణ్ణి, ప్రేక్షకుణ్ణి రంజింపజేసే జాతిరత్నమవుతుంది.

ఇంక-నవవిధ భక్తిమార్గాలున్నాయి.శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం... ఇవి ఆధ్యాత్మికంగా మనిషిని సమున్నత భక్తితత్వం వైపునకు మళ్లించి మోక్షమార్గాన్ని చూపుతాయి.

ఇలా నవరత్నాలవంటి విషయాలు ఎన్నో ఉన్నాయి. మరాఠా యోధుడు శివాజీ,మొదటి బలిదానం మంగళ్ పాండే,మన్యం విప్లవంలో అల్లూరి,ఝాన్సీ రాజ్య రక్షణలో లక్ష్మీబాయ్, ఉరితాడును ముద్దాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య బీజాలునాటిన జాతిరత్నాలు. సుభాస్ బోస్, తిలక్, గాంధీజీ, అంబేద్కర్ దేశం గర్వించదగ్గ జాతిరత్నాలు.

మరి-విద్యార్థులుగా ఇప్పుడు చదువుకునే రోజుల్లో "అభిరుచి,ఆసక్తి, సాధన,అభ్యాసం,ఏకాగ్రత, పునశ్చరణ, క్రమశిక్షణ, అవగాహన, సమర్పణ" వంటివే మీరు విజయాలు సాధించటానికి కావలసిన నవరత్నాలు. ఎప్పుడైతే మీరు వీటిని మీ ఆచరణలోకి తెచ్చుకున్నారో అప్పుడే మీకు మీరు, కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడే "భారత జాతిరత్నాలు" అవుతారు.

చివరిగా ఒక్కమాట-మన జీవితాన్ని మహత్తరంగా, సమున్నతంగా మార్చివేసే ఒక వ్యక్తికానీ, పుస్తకంకానీ జాతిరత్నమే! అంతేనా-గొప్ప సందేశంతో మనకు ఆనందాన్ని కలిగిస్తూ అద్భుత కళాఖండంగా తీర్చిదిద్దే సినిమా కూడా జాతిరత్నమే!!

# నేషనల్ థాయ్ బాక్సింగ్‌లో నన్నయ విద్యార్థికి స్వర్ణం

**16.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పొలిటికల్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎం.తులసి నేషనల్ థాయ్ బాక్సింగ్‌లో స్వర్ణపతకాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం తులసికి వీసీ స్వర్ణ పతకాన్ని, సర్టిఫికెట్టును అందించి శాలువాతో సన్మానించి అభినందలు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలం బంగారు గూడెం గ్రామంలో నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన తులసి విశ్వవిద్యాలయం చదువుకుంటూ ఎంతో పట్టుదలతో థాయ్ బాక్సింగ్ లో రాణిస్తుందని అన్నారు. జిల్లా



తులసిని సన్మానించి స్వర్ణపతకాన్ని, సర్టిఫికెట్‌ను అందిస్తున్న వీసీ

స్థాయి, రాష్ట్ర స్థాయి థాయ్ బాక్సింగ్ పోటీలలో వరుసగా స్వర్ణ పతకాలను సాధించి ఇప్పుడు జాతీయ స్థాయి పోటీలలో స్వర్ణపతకాన్ని కైవసం చేసుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఫిబ్రవరి 26, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ థాయ్ బాక్సింగ్ లో 50 కేజీల కేటగిరిలో తులసి సత్తాచాటిందని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన అభ్యర్థులతో తలబడి గట్టిపోటీ మధ్య విజయం సాధించిందని అభినందించారు. అలాగే అంతర్జాతీయ పోటీలలో కూడా విజయం సాధించి కన్నవారికి, పుట్టిన ఊరికి, విద్యాలయానికి విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తులసికి నైపుణ్యమైన శిక్షణను అందిస్తున్న కోచ్ కె.మధుకుమార్, సహకారాన్ని అందిస్తున్న పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డా.ఎన్.రాజశేఖర్ లను వీసీ అభినందించారు.

# ఆంగ్లంపై పట్టు ఆత్మస్థైర్యానికి మెట్టు



ఆంగ్లో సోఫీ క్లబ్‌ను ప్రారంభించి, బ్రోచర్ ఆవిష్కరించిన ప్రారంభించిన వీసీ

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

ఆంగ్లంపై పట్టు సాధిస్తే ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్ని విషయాలలో ముందుండి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్ లో గురువారం "ఆంగ్లోసోఫీ క్లబ్"ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గ్లోబల్ లాంగ్వేజ్‌గా గుర్తింపు పొందిన ఆంగ్ల భాషపై విశ్వ విద్యాలయ విద్యార్థులంతా పట్టు సాధించాలని అన్నారు. ఆంగ్లోసోఫీ క్లబ్ ద్వారా విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ ఇంగ్లీషు లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ శిక్షణను అందిస్తారని విద్యా, ఉద్యోగాల నిమిత్తం విదేశాలకు వెళ్ళాలనే విద్యార్థులకు ఆంగ్ల భాషపై చక్కని తర్ఫీదు దీనిలో అందుతుందని అన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణతో పాటు క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెల విద్యార్థుల్లో ఆంగ్లంపై పట్టు సాధించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారని అన్నారు. ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ వీసీ జగన్నాథరావు ప్రోత్సాహంతో విద్యార్థులందరికీ ఉపయోగపడేలా ఆంగ్లోసోఫీ క్లబ్‌ను రూపొందించామన్నారు. క్లబ్ కోఆర్డినేటర్‌గా బి.బి.అహ్మద్ అలీబాబా, కో కోఆర్డినేటర్‌గా డి.విద్యాశ్రీవాణి వ్యవహరి స్తున్నారని తెలిపారు. తరువాత వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహు మతులను అందజేసారు. ఆంగ్లోసోఫీ క్లబ్ ఏర్పాటుకు సహకరించిన వీసీ ని సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, కోర్సు కోఆర్డినేటర్లు ఎం.బాలకృష్ణ, వి.విజయదుర్గ, జె.హనుమంతు, బి.లక్ష్మీ, ఎ.ఎం.శిరీష, డి.దాసు, ఎన్.రాహుల్ పాల్ పాల్గొన్నారు.

**హమ్మయ్య... పరీక్షలు అయిపోయాయి**



ఫొటో :- జనని, ఎంసీఏ ఫస్టియర్

## మగువ



వేదభూమిలోన మెరిసిన వేకువ
వెలుగల్లే పలికిన సుప్రభాత గీతం
నీవేగా...
కదనరంగమైనా నిశిలో
కారుచీకటైనా... నిలిచే కాంతిజ్వాల నీవే
ఓ మగువా!!

కదిలిపోమంటావు కన్నీరొద్దంటావు...పడిపోయినా
లేవాలంటూ... ధైర్యమే ఇస్తావు...
విజయపు తీరంలోన సేదతీరమంటావు.. వెన్నెలే
నీ హద్దని సాగిపోమంటావు...
పరుగులూ నీవే...
ఆ పథములూ నీవే...
సహనమే నీ రథమనీ... గమ్యాన్ని చేర్చుతావు
కడలివీ నీవే... ఆ అలలలో నీవే...
గగనమే ఆసనమని... సామ్రాజ్యమేలుతావు!!

వేదభూమిలోన మెరిసిన వేకువ వెలుగల్లే పలికిన
సుప్రభాత గీతం నీవేగా...
కదనరంగమైనా నిశిలో కారు చీకటైనా... నిలిచే
కాంతిజ్వాల నీవే ఓ మగువా!!

-చంద్రిక గూడపాటి, పిహెచ్‌డి
పరిశోధక విద్యార్థి, ఆంగ్ల శాఖ



## మంచి మాట

అహంకారం, గర్వం,
పొగరుబోతు తనం...
చాలా ఖరీదైనవి.
అవి కొనుక్కునే స్తోమత మనకులేదు.
అందుకే.. చవగ్గా దొరికే సంతోషం,ప్రేమ,చిరునవ్వు,
సంతృప్తి,సర్దుబాటు అనేవాటితో సరిపెట్టుకుందాం!!




# సమాజ హితమైన సేవలందించాలి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సమాజహితమైన సేవలను అందించాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వ విద్యాలయంలో బుధవారం ఎన్.ఎస్.ఎస్ అడ్వైజరీ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి ఈ ఏడాది కాలంలో నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలని వివరించారు. 2021-22కు సంబంధించిన ఎజెండాను, యాక్షన్ ప్లాన్ ను తెలియజేసారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సమాజహితమైన సేవలను అందించాలని అన్నారు. కోవిడ్ కాలంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు నుండి వాలంటీర్లు విశేషమైన సేవలను అందించారని ప్రసంసించారు. ప్రస్తుత కొవిడ్ పరిస్థితుల నేపధ్యంలో వైద్య సేవలను అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఎన్.ఎస్.ఎస్ ద్వారా విద్యార్థులకు సేవాధృక్పథం అలవడుతుందని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలోనే ఎక్కువ ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు ఉన్న నన్నయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తరువాత స్టేట్ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ డా.కె.రమేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి కార్యక్రమాల చేపడుతుందని వాటిని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ముందుకు తీసుకువెళ్ళాలని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ లో పని చేసే కోఆర్డినేటర్, ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం కొత్త విధానాలను ప్రవేశపెట్టబోతుందని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్.ఎస్.ఎస్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని దానిని సద్వినియోగం చేసుకుంటు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని తెలియజేసారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, ఫైనాన్స్ ఆఫీసర్ సత్యనారాయణ, ఫిలాంత్రోఫిస్ట్ అద్దంకి రాజా, క్లస్టర్ ఆఫీసర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభా వాణి

#### ప్రముఖ సంగీత దర్శకులు...

## కె.వి.మహదేవన్

(1917 మార్చి 14 - 2001 జూన్ 21)



కృష్ణన్‌కోయిల్ వెంకటాచలం భాగవతార్ మహాదేవన్ (కె. వి. మహదేవన్)

దక్షిణ భారతీయ చలన చిత్ర సంగీత దర్శకులు. చిన్నతనం నుంచి సంగీతం వైపు ఆసక్తి చూపారు. వీరి పూర్వీకులు కూడా సంగీత రంగంలో నిష్ణాతులే. ఏడవ తరగతి వరకు చదివి ఆపేసి నాటకాల్లో నటించారు. తర్వాత చిత్రాల్లో పనిచేయడం కోసం మద్రాసు వెళ్ళారు. కొంతమంది మిత్రులు సంగీత రంగంవైపు మళ్ళమని సలహా ఇవ్వడంతో సంగీత దర్శకుడు ఎస్. వి. వెంకట్రామన్ దగ్గర సహాయకుడిగా చేరారు. టి. ఎ. కల్యాణం దగ్గర కూడా పనిచేసి వృత్తి మెలకువలు నేర్చుకున్నారు. 1942 లో ఆనందన్ అనే చిత్రానికి మొదటగా సంగీత దర్శకత్వం వహించారు. 1952 లో ఈయనకు మలయాళీ అయిన పుహళేందితో పరిచయం ఏర్పడింది. పుహళేంది మహదేవన్ తో కలిసి చివరి దాకా పనిచేశాడు. 1962 లో విడుదలైన 'మంచి మనసులు' సినిమాలో ఈయన స్వరపరిచిన "మామ.. మామ.." అనే పాట బహుళ ప్రజాదరణ పొందింది. ఈయనకు మామ అనే ముద్దు పేరు కూడా వచ్చింది. ఈయన సంగీతం కూర్చిన చివరి సినిమా కబీర్ దాస్ (2003).

మహాదేవన్ తండ్రి వెంకటాచలం భాగవతార్ గోటు వాద్యంలో నిష్ణాతుడు. వాళ్ల కుటుంబమంతా సంగీతమయమే. మహాదేవన్ తాతగారు తిరువాన్కూరు సంస్థానంలో సంగీత విద్వాంసునిగా పని చేసేవారు. నాలుగేళ్ల ప్రాయంలోనే చిన్నారి మహాదేవన్ నాదస్వర వాద్యానికి ఆకర్షితుడై నాదస్వర విద్వాన్ రాజరత్నం పిళ్లై దగ్గర శిష్యరికం చేశారు. అలాగే బూదంపాడి అరుణాచల కవిరాయర్ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకొని కొన్ని కచ్చేరీల్లో పాల్గొన్నారు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదివారు. ఆ తరువాత కొన్ని నాటకాలలో నటించి, సినిమాల్లో చేరాలని ఆశతో టి.వి.చారి గారి సహాయంతో మద్రాసులో అడుగుపెట్టారు. "తిరుమంగై ఆళ్వార్" అనే తమిళ సినిమాలో జూనియర్ ఆర్టిస్ట్ గా నటించే అవకాశం లభించింది.

1942 వ సంవత్సరంలో "మనోన్మణి" అనే తమిళ సినిమాలో "మోహనాంగ వదనీ" అనే పాటకు సంగీతం సమకూర్చే అవకాశం లభించింది. ఎం.ఎస్ విశ్వనాథన్ సమకాలీకుడైన మహాదేవన్ 1942లో ఆనందన్ అనే తమిళ సినిమాతో చిత్రరంగములో అడుగుపెట్టారు.

1963లో వచ్చిన "మూగ మనసులు" ఆయనను తిరుగులేని స్థానానికి చేర్చాయి. తెలుగు సినిమా సంగీతంలో ఓ కొత్త బాణీకి ఊపిరిపోశారు. కాని ఈయనకు తెలుగు రాదు. అయినా సంగీతానికి భాష అనే ఎల్లలు లేవు అని నిరూపించిన వారిలో మహదేవన్ ఒకరు. ఈయన కవి పాట రాశాక దానికి స్వరాలను అద్దేవారు. చివరి వరకు ఆయన ఇదే పద్ధతిని అనుసరించారు. మనం బాణీ చేసి ఇస్తే అందులో మాటలు పట్టక కవి ఇబ్బంది పడతాడు. అందుకే ఆ పద్ధతి వద్దు అని సున్నితంగా తిరస్కరించేవారు. పాటలోని సాహిత్యాన్ని అధిగమించకుండా స్వరాలను అల్లేవారు. ఒక్కోసారి సాహిత్యం కోసం బాణీల్లో మార్పులూ చేర్పులూ చేసేవారు. తెలుగు తెలియకపోయిన కవి రాసిన సాహిత్యం అర్థం కాకపోయినా అడిగి మరీ దానర్థం తెలుసుకొని సందర్భానుసారం స్వరాలను అందించేవారు.

సంపూర్ణ రామాయణము, తిరువిళయదాల్ వంటి పౌరాణిక చిత్రాలకు పేరుమోసిన మహాదేవన్ శాస్త్రీయ సంగీతాన్ని, సినిమా సంగీతముతో మిళితం చేసే ఒరవడికి ఆద్యుడని భావిస్తారు. అనేక మంది సినీ సంగీత దర్శకులకు ఈయన గురువు. ఈయన సంగీతం సమకూర్చిన సినిమాలలో "శంకరాభరణం, దసరా బుల్లోడు, గోరింటాకు, ఇక భక్తి చిత్రాలైనటువంటి అయ్యప్పస్వామి మహత్యం, అయ్యప్పస్వామి జన్మ రహస్యం" ఇంకా భార్గవ ఆర్ట్స్ ప్రొడక్షన్ లో వచ్చిన సుమారు అన్ని చిత్రాలకు మహదేవన్ స్వరాలను అందించారు. తమిళంలో కందన్ కరుణై, వసంత మాలిగై, వియత్నాం వీడు, పడిక్కథ మీతై, వానంబాడి ప్రసిద్ధిగాంచినవి. ఈయన సంగీతం సమకూర్చిన చివరి సినిమా కబీర్ దాస్ (2003) లో చనిపోయిన తరువాత విడుదలైంది. చనిపోక ముందు చివరి సినిమా " కె. విశ్వనాధ్ తీసిన "స్వాతి కిరణం" నిజంగా చెప్పలంటే ఈ సినిమాకు రెండు పాటలనే స్వరపరిచారు. తమిళంలో చివరి సినిమా మురుగనే తుణై (1990)

**పురస్కారాలు:**

జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు (1967) – కందణ్ కరుణై.

జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు (1980) – శంకరాభరణం

జాతీయ స్థాయిలో ఉత్తమ సంగీత దర్శకునిగా పురస్కారం అందుకొన్న మొదటి వ్యక్తి.

తిరై ఇసై తిలగం (1963) – (పద్మశ్రీ శివాజి గణేశన్ ప్రదానం చేశారు.)

మెల్లిసై చక్రవర్తి (1967) – (బొంబాయి మ్యూజిక్ డైరక్టర్స్ అసోసియేషన్ తరుపున సి.రామచంద్ర ప్రదానం చేశారు.)

స్వరబ్రహ్మ (1976) – (రాజమండ్రిలోని లలిత కళానికేతన్ ప్రదానం)

సంగీత చక్రవర్తి (1976) – హైదరాబాదు ఫిలిం సర్కిల్ వారి ప్రదానం.)

కె.వి.మహదేవన్ జయంతి సందర్భంగా వారికిదే నన్నయవాణి అక్షర నీరాజనం!!

# ఆయా విభాగాల్లో కంప్యూటర్లు ఏర్పాటు


కంప్యూటర్లను ప్రారంభించిన వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యూకేషన్ కళాశాల్లోని ఆయా విభాగాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు మరియు యూపిఎస్‌లను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఏర్పాటు చేసారు. విశ్వవిద్యాలయం ప్రారంభించిన నాటి నుండి చాలా విభాగాలకు సాంకేతిక వసతులు లేవని గుర్తించిన వీసీ యూనివర్సిటీలోని అన్ని డిపార్టమెంట్లకు కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా గురువారం సైకాలజీ విభాగంలో వీసీ కంప్యూటర్‌ను ప్రారంభించి ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించుకోవాలని తెలియజేసారు. విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలకు సాంకేతిక వసతులను కల్పించి విభాగాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 26 కంప్యూటర్లు, 26 యూపిఎస్‌లు, 20 ప్రింటర్లను విభాగానికి ఒక్కొక్కటి చొప్పున అందజేశామని అన్నారు. అన్ని విభాగాల అధ్యాపకులు వీటిని సద్వినియోగం చేసుకొని తమ పాఠ్యాంశాలకు సంబంధించిన ఈ కంటెంట్‌లను, ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌లను, ఆన్ లైన్ క్లాసులను, వెబినార్లను నిర్వహిస్తూ విద్యా, విజ్ఞాన పరమైన ప్రగతికి దోహదపడాలని సూచించారు. గురువులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులను నూతన అంశాలను బోధించాలని తెలియజేశారు. చాలా కాలంగా విభాగాలకు ఉన్న సాంకేతిక అవసరాలను తీర్చిన వీసీకి ఆచార్య ఎస్.టేకి మరియు అధ్యాపకులు కృతజ్ఞతలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ పడాల రాజశేఖర్, వెబ్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు, డా.సి.వి.ఎస్. మణిరమణ, సిహెచ్.ఎన్.కె. భవాని, డా.ఎన్.వి.వి.వి.ఎస్. నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఆకులో ఆకునై...

దీపక్ కృష్ణ, ఫస్ట్ బి.ఎస్సీ, ఛాంబర్స్ డిగ్రీ కాలేజ్, పాలకొల్లు


పి.పవన్‌సాయి, ఇఇఇ ఫస్టియర్

# విశ్వవిద్యాలయ ప్రాంగణ వసతి గృహాలు



బాయ్స్ హాస్టల్



ఉమెన్స్ హాస్టల్ పైన సోలార్ పవర్



ఆర్‌ఓ ప్లాంట్



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ



హాస్టల్ ను పరిశీలించిన రిజిస్ట్రార్



మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు



జిమ్ వ్యాయామంలో విద్యార్థులు

ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యాభ్యాసం నిమిత్తం వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు చక్కని వసతి గృహాలు ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో జిమ్, స్టడీ రూమ్స్, సీసీ కెమేరాల పర్యవేక్షణలో హాస్టల్స్ నడపబడుతున్నాయి. స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్‌గా విద్యార్థులచే మెస్ నడుస్తుంది. మెస్ కమిటీ, స్టోర్ కమిటీ, టేస్టింగ్ కమిటీ, ఫ్లోర్ కమిటీ వంటి వాటితో విద్యార్థులే హాస్టల్స్‌ను నిర్వహిస్తుంటారు. వీరికి పైన విశ్వవిద్యాలయ సహాయాచార్యులు నివాస సంరక్షకులుగా వారికి పైన చీఫ్ వార్డెన్స్ పర్యవేక్షిస్తుంటారు. విద్య, వినోదం, ఆటలు, పాటలతో కొత్త స్నేహితులతో అందంగా, ఆనందంగా ఉండే ఈ హాస్టల్స్ యూనివర్సిటీకి ప్రత్యేకతగా చెప్పవచ్చు.



## విద్యార్థులకు చక్కటి వసతి గృహాలు

స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్‌గా నడపబడుతుంది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో వీసీ అనుమతితో గెస్ట్ హౌస్‌ను బాయ్స్ హాస్టల్‌గా మార్చాం. ప్రస్తుతం 12 మంది సిబ్బందితో ఇద్దరు రెసిడెంటిల్ వార్డెన్స్‌తో చక్కని పర్యవేక్షణలో హాస్టల్ నడుస్తుంది. హాస్టల్ జీవితం విద్యార్థులకు ఎంతో ఆనందాన్ని, అనుభవాన్ని ఇస్తుంది. విద్యార్థులకు వైఫై సదుపాయాన్ని కల్పించేందుకు వీసీ సుముఖత చూపించారు. ప్రభుత్వ సహకారంతో త్వరలో కొత్త హాస్టల్ భవనాన్ని నిర్మాణం చేసుకొని, మరింత ఎక్కువ మంది విద్యార్థులకు హాస్టల్ వసతులను కల్పిస్తాం.

**డా.బి.జగన్మోహనరెడ్డి చీఫ్ వార్డెన్, బాయ్స్ హాస్టల్**



## చక్కని పర్యవేక్షణలో విద్యార్థినులు

చక్కని పర్యవేక్షణలో విద్యార్థులంతా హాస్టల్‌లో ఉంటారు. హాస్టల్ పనుల నిమిత్తం 20 మంది సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు. విద్యార్థుల పర్యవేక్షణ కోసం రెసిడెంటిల్ వార్డెన్‌తో పాటు రెసిడెంటిల్ నర్సు, కేర్ టేకర్ కూడా అందుబాటులో ఉంటారు. స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్‌గా వివిధ కమిటీలలో విద్యార్థులే ఉండి హాస్టల్‌ను నడుపుతుంటారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉమెన్స్ హాస్టల్‌లో ప్రత్యేక స్టడీ రూమ్‌ను ఏర్పాటు చేసారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. త్వరలో ఇండోర్ గేమ్స్ వైఫై సదుపాయం కల్పిస్తాం.

**- డా.కె.రమణేశ్వరి,**
**చీఫ్ వార్డెన్ ఉమెన్స్ హాస్టల్**

### పురుషుల వసతి గృహం

- విద్యార్థుల సంఖ్య 460
- రూమ్స్ 85
- జిమ్, స్టడీ రూమ్
- స్టీమ్ కుకింగ్, ఆర్.ఓ ప్లాంట్
- సీసీ కెమెరాల పర్యవేక్షణ

### నిర్ణీత సమయంలోనే అనుమతి

**ఉ. 5.30- సా.6.30 వరకు**

### మహిళల వసతి గృహం

- విద్యార్థుల సంఖ్య 646
- రూమ్స్ 105
- టీవీ రూమ్, స్టడీ రూమ్
- సోలార్ పవర్
- సీసీ కెమేరాల పర్యవేక్షణ



డా.కె.బాల సత్యనారాయణ, రెసిడెంటిల్ వార్డెన్



డా.ఎల్.ముత్యాలు నాయుడు, రెసిడెంటిల్ వార్డెన్



స్టడీ రూమ్‌ను ప్రారంభించిన వీసీ



ఉమెన్స్ హాస్టల్



మెస్ లో భోజనం చేస్తున్న విద్యార్థులు



ఉమెన్స్ హాస్టల్ టీవీ రూమ్, స్టడీ రూమ్





వంటశాలలో ఫుడ్ కటింగ్ మిషన్‌తో పనిచేస్తున్న మహిళ





- రెసిడెంటిల్ వార్డెన్ : డా.కె.సుజాత, నర్సు: మేరీ

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in